


# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

గుంటూరు పల్నాడు

శనివారం 01 నవంబర్ 2025 - పేజీలు 9


# సమస్యలపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు..!

దుబారా ఖర్చులపై ఆగ్రహం



**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలి పట్టణంలో తిష్టవేసిన సమస్యలపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన కౌన్సిలర్‌లు గళమెత్తారు. ఇంజనీరింగ్ అధికారుల తీరు వల్ల వార్డులలో కౌన్సిలర్‌లకు విలువలేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు చెపుతున్నా అధికారుల తీరు మారకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత

2లో

### పునరావాస కేంద్రాల నిర్వహణపై..

తుఫాను కారణంగా పట్టణంలో ఎక్కడెక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లకు ఎందుకు సమాచారం అందించలేదని టీడీపీ సభ్యులు త్రిమూర్తి మరికొందరు సభ్యుల ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన చైర్ పర్సన్ తనకు సమాచారం లేదని తన సిబ్బందిని విచారించి తెలుసుకున్నానని చెప్పారు. దేనిపై కమీషనర్ అప్పలనాయుడును ప్రశ్నించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు విషయంలో ఆయన దాటవేత ధోరణి అవలంభిస్తూ ఇకపై సభ్యులకు సమాచారం అందిస్తామన్నారు.



# అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు వెంటనే జరగాలి

### కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నగరంలో అభివృద్ధి, పారిశుధ్య పనులు పిన్ పాయింట్ ప్రకారం జరగాలని, ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండడానికి వీలు లేదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ దుర్గా నగర్, ఐపిడి కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు

వివరాలు 2లో...

# రైతులను నష్టాల బారి నుండి కాపాడాలని సీఎం ఆదేశం

### కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** పంట పొలాల్లో నీరు బయటకు పంపాలని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. తుఫాను ప్రభావంతో వివిధ పంట పొలాల్లో పరిస్థితిని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు, నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. పంటలను ఎట్టి పరిస్థితుల్లోను కాపాడాలని ముఖ్యమంత్రి ఆదేశించి ఉన్నారని చెప్పారు. అందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి సమస్య భవిష్యత్తులో ఉత్పన్నం కాకుండా శాశ్వత

వివరాలు 2లో...

# పోలీస్‌గా ప్రజలకు అందించిన సేవలు అమూల్యం



### ఎస్పీ వకుల్ జిందల్

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** పోలీస్ శాఖలో చేరి వివిధ హెూదాల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించి పదవీ విరమణ చేయటం అభినందనీయం అని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కొనియాడారు. సుమారు 42 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు విశేష సేవలందించి, శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు ఎస్ఐల సన్మానార్థం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించబడింది. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వకుల్

వివరాలు 2లో...

# స్థానిక సంస్థలకు.. జీవం..!

పంచాయితీ రాజ్‌కు.. సంస్కరణల మకుటం

నేటి నుండి అందుబాటులోకి డిఎల్ డిఓ కార్యాలయం

రూ.10 లక్షలతో కార్యాలయ అధునికీకరణ పనులు

డివిజనల్ అభివృద్ధి అదికారి సేవలో మెరుగుపడనున్న పర్యవేక్షణ



**సత్తెనపల్లి, మేజర్‌న్యూస్ :** స్థానిక సంస్థల పరిపాలనా స్వరూపం పూర్తిగా మారనుంది. పంచాయితీ రాజ్‌కు సంస్కరణ మకుటంతో సంక్షేమం ప్రజలకు మరింత చేరువ కానుంది. స్థానిక సంస్థలు మరింత బలోపేతం కానున్నాయి.. నవంబర్ ఒకటి నుండి రాష్ట్రప్రభుత్వం డిఎల్ డిఓల కార్యలయాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. సత్తెనపల్లిలో గత తెలుగుదేశం ప్రభుత్వ హాయాంలో నిర్మించిన జిల్లా పరిషత్ విశ్రాంత భవనాన్ని డిఎల్ డిఓ కార్యాలయంగా మార్చారు.వసతుల కల్పన కోసం రూ. 10 లక్షల జడ్‌పి నిధులతతో ఆధునికీరణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ మెరుగుపరచడం, ప్రజలకు జవాబుదారీగా ఉండటం, పరిపాలను వేగవంతం చేయడం, సంక్షేమాన్ని ఇంటి గడప వద్దకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. నేటి నుండి అందుబాటులోకి రానున్న డిఎల్ డిఓ కార్యాయల సేవలపై ప్రత్యేక కథనం.

### పంచాయితీ రాజ్‌లో పునర్వవస్థీకరణ

ఇప్పటి వరకు ఉన్న పంచాయితీ కార్యదర్శి హెూదా.. నేడి నుండి “పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ)”గా మారనుంది. ఇఓపిఆర్‌డిలను డిప్యూటీ ఎంపిడిఓలను ఇటీవల హెూదా మార్చారు. గ్రామాలలో ఉన్నక్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి గ్రామాలను స్వతంత్ర యూనిట్‌గా తీర్చిదిద్దుతున్నారు. ప్రతి పంచాయితీకీ ఒక పిడిఓ రానుండటంతో పరిపాలనాపరమైన సౌలభ్యం, స్వతంత్ర లభించనున్నాయి. ప్రభుత్వ సేవలు మెరుగుపడున్నుయి. సంక్షేమ

2లో

# సమస్యలపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు





మొదటి పేజీ తరువాయి

వహించారు. సమావేశం ప్రారంభం కాగానే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు ఆవుల కోటయ్య, అన్నాబత్తుని పద్మజలు వార్డులలో నిలచిపోయిన అభివృద్ధి పనులపై ప్రశ్నించారు. కొన్ని పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తామని, మిగిలిన వాటికి త్వరలో టెండర్లు పిలుస్తామని ఎఈ సునీల్ తెలిపారు. జిల్లా వైద్యశాల రోడ్డుకు మంత్రి మనోహర్ శంకుస్థాపన చేసి నెలలు దాటుతున్న పనులు ఎందుకు ప్రారంభించలేదని జనసేన కౌన్సిలర్‌లు కొమరబత్తిన జయపాల్, గోగిరెడ్డి మానసరెడ్డిలు ప్రశ్నించారు. రోడ్డు గుంతలుగా ఏర్పడి రోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం డస్ట్‌తో గుంతలు పూడ్చాలని కోరారు. త్వరలో మరమత్తులు చేయిస్తామని ఎంఈ శ్రీకాంత్ హామి ఇచ్చారు.

## నిర్వాహణ ఖర్చుల పేరిట నిధులు దుర్వినియోగం..

అజెండాలో పొందుపరచిన నిర్వాహణ ఖర్చుల పేరట రూ.44లక్షలు, అదర్స్ పేరిట రూ.4లక్షలు దీనికి ఉపయోగించారో తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు కోరారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవటంతో ప్రజాధనాన్ని ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి పనులకు నిధులు లేవని చెప్పే అధికారులు దుబారాను ఎందుకు తగ్గించటంలేంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్దతి మార్చుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయం వెనుక అసంపూర్తిగా ఉన్న భవనాన్ని ఆనిధులతో పూర్తి చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పేరం సంజవరెడ్డిలు సూచించారు.

## కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

తెనాలి పట్టణంలో కుక్కల సమస్యల ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య కోరారు. దీనిపై కౌన్సిలర్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో కమిటీ వేసి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు హామి ఇచ్చారు. వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, అన్నం పిన్నారావు, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, షేక్ ఇస్మాయేల్‌లు తమ వార్డులోని సమస్యలపై ఏకరువు పెట్టారు. వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పలువురు కౌన్సిలర్‌లు, కో అప్షన్ సభ్యులు, వివిద విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సుందరీకరణపై అభ్యంతరం..

రూ. 2 కోట్లతో పట్టణంలోని బోసు రోడ్డులోని వీనస్ థియేటర్ వద్ద నుండి చినరావూరు సత్యనారాయణ పార్కు వరకు సుందరీకరణపై టిడిపి సభ్యులు త్రిమూర్తి మరికొంత మంది సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమృద్ధిలో మురుగు సమస్య ప్రధానంగా ఉందని సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మాణంలో ఉన్న వాణిజ్య భవన పనులు పూర్తి చేసేందుకు వెచ్చిస్తే మంచిదన్నారు. పలువురు కౌన్సిలర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

# పోలీస్‌గా ప్రజలకు అందించిన సేవలు అమూల్యం

మొదటి పేజీ తరువాయి

జిందల్ ముఖ్య అతిథిగా హాజరై, ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు మరియు వారి కుటుంబ సభ్యులకు పూలమాలలు, శాలువాలతో ఘన సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపి, వీడ్కోలు పలికారు. పట్టాభీపురం పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న టి సుబ్బారావు, నల్లపాడు పోలీస్ స్టేషన్లో మహిళా ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జయరాణి, తెనాలి పోలీస్ కంట్రోల్ రూమ్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వివిఎన్ మల్లేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తేవడంలో మీరు కీలక పాత్ర పోషించారు. మీకు సంపూర్ణ ఆరోగ్యాన్ని దేవుడు ప్రసాదించాలి అని ఎస్పీ ఆకాంక్షించారు. అదనపు ఎస్పీలు రమణమూర్తి , హనుమంతు, ఎస్‌బి సిఐ అలహరి శ్రీనివాస్, ఏం టీ ఆర్ ఐ శ్రీహరి రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, ఉద్యోగ విరమణ పొందిన సహచర బ్యాచ్ ఎస్సైలు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

# రైతులను నష్టాల బారి నుండి కాపాడాలని సీఎం ఆదేశం

మొదటి పేజీ తరువాయి

పరిష్కారం కోసం తగిన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. జలవనరుల శాఖ వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేసి పక్కాగా సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం మాట్లాడుతూ పెదనందిపాడు వద్ద నల్లమడ వాగుకు పరుచూరు, ఆలేరు వాగుల నుండి నీరు చేరి 42,335 క్యూసెక్కుల నీరు ప్రవహించిందని, తద్వారా పంట పొలాల్లో బాగా నీరు చేరిందన్నారు. కొమ్మూరు కాలువ గండి పడిందన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా క్రింద 3746 హెక్టార్లలో పంట నీట మునిగిందన్నారు. ఇందులో కాకుమాను మండలంలో 1326 హెక్టార్లు, పెదకాకాని మండలంలో 460 హెక్టార్లు, పెదనందిపాడులో 363 హెక్టార్లు, మంగళగిరిలో 265 హెక్టార్లు, తాడేపల్లిలో 92 హెక్టార్లు, ప్రత్తిపాడులో 70 హెక్టార్లు, చేబ్రోలులో 7 హెక్టార్లు ఉన్నాయన్నారు.



నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులు తమ ప్రాంతంలో పంటలు, కాలువల పరిస్థితిని వివరించారు. కాలువలకు చేపట్టాల్సిన పనుల వివరాలను తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని జరిగే ధర్నాను జయప్రదం చేయండి



**ప్రత్తిపాడు:మేజర్ న్యూస్:** అన్నదాత సుఖీభవ 20,000 రూపాయలు కౌలు రైతులకు జమ చేయాలని, నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 3 వ తారీకు సోమవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ధర్నా కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం భూయజమాని సంతకం ఉంటేనే కౌలు గుర్తింపు కార్డు ఇచ్చింది. కార్డులు వచ్చిన వారికే రైతు భరోసా ఇచ్చారు. గుర్తింపు కార్డు వచ్చినా ఓసి కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేదు. అప్పటి ప్రతిపక్షం ప్రస్తుతం అధికారపక్షం కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పాత చట్టాన్ని రద్దు చేస్తామని, అన్ని విధాల కౌలు రైతులను ఆదుకొనేలా కొత్త చట్టం తెస్తామని, ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ కింద ?20,000 జమ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముసాయిదా చట్టాన్ని తయారుచేసి వివిధ ప్రాంతాల్లో రైతు సంఘాలు, సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు శాసనసభలో ప్రత్యేకంగా పాత చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు, కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇస్తున్నట్టు ప్రకటించారు. కానీ ఇంతవరకు ముసాయిదాను అసెంబ్లీలో చట్టం చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. వాస్తవంగా పంటలు సాగు చేసినవారికి పంట రుణాలు ఇవ్వాలని ఆ ప్రకారం బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు, ముద్దన వెంకటేశ్వర్లు, దొప్పలపూడి రమేష్ బాబు, కన్నెగంటి చంద్రరావు, పసుపులేటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం

**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టరేట్ , జాషువా సమావేశ మందిరంలో పాఠశాల విద్యా శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి , మండల విద్యాశాఖాధికారులు, మరియు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తో పాటు సోషల్ వెల్ఫేర్, ట్రైబల్' వెల్ఫేర్, ఇంటర్మీడియట్ అధికారి ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాల లభ్యత, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల విద్యా ప్రగతిపై అధికారుల నుండి సమగ్ర నివేదికలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలలో రాష్ట్రం లో ఆగ్రా స్థానం లో నిలవడమే మన ప్రధాన లక్ష్యం తో పాటు ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయుల సమయపాలన వుండాలి అని , విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి" అని పేర్కొన్నారు. సమావేశంలో పలు సూచనలు, అభిప్రాయాలు వినిపించబడ్డాయి. కలెక్టర్ అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు . సమష్టిగా పని చేసి జిల్లాను విద్యా రంగంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు అని ఒక విద్యాశాఖ అధికారిని ఎల్. చంద్రకళ తెలియచేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలకు.. జీవం..!

మొదటి పేజీ తరువాయి

పథకాలు ఫలాలు క్షేత్రస్థాయిలో నేరుగా అందనున్నాయి. స్థానిక సంస్థలకు జడ్‌పి సిఇఓ, కలక్టర్‌కు మద్య డిఎల్ డిఓ( ప్రాంతీయ అభివృద్ధి అదికారి) సమన్వయం చేయనున్నారు.సత్తెనపల్లి,పెదకూరపాడు నియోజకవర్గాలను ప్రాంతీ అభివృద్ధి అధికారి పర్యవేక్షించనున్నారు. డీఎల్‌డీఓ కార్యాలయాల ఆవరణలోనే డివిజనల్ పంచాయతీ అధికారి, డ్వామా ఏపీడీల కార్యలయాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా ఒకే గొడుగు క్రిందకు డివిజనల్ స్థాయి స్థానిక సంస్తల కార్యాలయాలు రానున్నయి.

## డిఎల్‌డిఓల పనితీరు ఇలా...



డివిజన్ స్థాయిలో అన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలను డీల్‌డీఓ నియంత్రిస్తారు. డివిజన్ స్థాయిలో అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమ న్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహిస్తారు. రెవెన్యూలో ఆర్‌డిఓ స్దాయిలో డిఎల్ డిఓ హెూదా, పరిధి ఉంటుంది. పాలనాపరంగా ప్రతి నెలా కనీసం 20 రోజులు పర్యటించి టూర్ డైరీలను కలెక్టర్లకు సమర్పించాలి. ఎంపీడీఓలతో పాటు డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బంది మొత్తం డీడీఓ నియంత్రణలో పనిచేస్తారు. ప్రతి ఆర్నెల్లకోసారి మండలపరిషత్ కార్యాలయాలను డీఎల్‌డీఓ తనిఖీ చేస్తారు. అభివృద్ధి పనుల్లో తేడాలుంటే జిల్లా యంత్రాంగానికి నివేదిస్తారు.సత్తెనపల్లిలో కార్యాలయం త్వరతిగతి న ఏర్పండేందుకు స్థానిక శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ, నాయకులు దరువూరి నాగేశ్వరరావులు విశేషంగా కృషిచేశారు. జిల్లా పరిషత్ నుండి రూ. 10 లక్షల నిధులుతో కార్యాలయ ఆదునికీకరణ పూర్తి చేయించారు. సంస్కరణ ఫలాలు ప్రజలకు అందేలా కృషిచేస్తామాని ప్రాంతీయ అభివృద్ధి కారి వై రాజగోపాల్ తెలిపారు.

# అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు వెంటనే జరగాలి

మొదటి పేజీ తరువాయి

ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ ల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువు మేరకు జరిగేలా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లేకుంటే సంబందిత ఎమినిటి కార్యదర్శి, ఏఈలే భాధ్యత వహించాలని స్పష్టం చేశారు. అనంతరం ఐపిడి కాలనీలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, ఎక్కడా డంపింగ్ పాయింట్లను లేకుండా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. కమర్షియల్ సంస్థలు వ్యర్థాలను రోడ్లు, డ్రైన్లలో వేస్తె కఠిన చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వాలని, అవసరైమతే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి ఇంటి నుండి వచ్చే వ్యర్థాలను తడిపొడిగా విభజన చేసి ఇవ్వాలని తెలిపారు.

# పంట నష్టపరిహారం రైతులకు ఇవ్వాలి



**తెనాలి, మేజర్ న్యూస్ :** మొంధా తుఫాన్ కారణంగా నష్టపోయిన ఉద్యాన పంటలు కు ఎకరం నకు రూ. 50 వేల పరిహారంగా ఇవ్వాలి అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కౌలు రైతుల సంఘం మండల నాయకులు జిలుగు ముక్కంటి తో కలిసి కొల్లిపర మండలం దావులూరిపాలెం, హనుమాన్ పాలెం గ్రామంలో పర్యటించి బాధితులను కలసి వివరాలు తెలుసుకున్నారు. అరటి పసుపు కూరగాయ తోటలు భారీ వర్షాలు గాలులకు రెండు పంటలు దెబ్బతిన్నాయని రైతులు తమ ఆవేదన వ్యక్తంచేశారు. తుఫాను దెబ్బకు అరటి కి పెట్టిన బొంగులు కూడా విరిగి పోయాయని అన్నారు. గత రెండు నెలలుగా వానలు బాగా పడుతుండటంతో నేల ఆరక పోవటం రోజులు తరబడి నీరు నిల్వ ఉండటం వల్ల పుచ్చు వచ్చే ప్రమాదం ఉందని దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కందకు పిలకలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కొల్లిపర మండలం దావులూరు గ్రామం కొత్త కాలువ లో తుంగ తూటాకు తో పూడి ఉందని దాన్ని తీయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కొల్లిపర మండలం లో సుమారు 500 ఎకరాల్లో అరటి దెబ్బ తిందని చెప్పారు. ప్రభుత్వం ప్రభుత్వం వెంటనే ఎన్యుమరేషన్ చేసి రైతులకు ఎకరానికి రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పంటల భీమా ను ఎత్తి వేసి రైతులే తమ వాటా ప్రీమియం చెల్లించుకోవాల్సి అని చెప్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో బట్ట రామారావు కేదార్నాథ్ వెంకట్రావు లు పాల్గొన్నారు.

## పంటపొలాల్లో త్వరితగతిన నీటి నిల్వలు మళ్లింపు

**శాటిలైట్ చిత్రాలతో గుర్తించి 24 గంటల్లో పూర్తి కార్యాచరణ**

**ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్**



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను కాపాడాలని ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తెలిపారు .తుఫాన్ తదనంతర చర్యలపై శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి శనివారం కల్లా మొత్తం నీటిని మళ్లించాలని స్పష్టం చేశారు. నియోజకవర్గం వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేసి... ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడకి అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా తగు విధంగా చర్యలు చేపట్టాలన్నారు.పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలంనుంచి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. జిల్లాలో ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని తెలిపారు . వ్యవసాయ శాఖ అధికారులకు రైతులను కలిసి నీట మునిగిన పంట పోలాలను సందర్శించి వివరాలను సేకరించి, పోలాలలో నీటిని వెంటనే బయటకి పంపాలని ఆదేశించారు.



## తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** దుగ్గిరాల మండలంలోని 15 పునరావాస కేంద్రాలలోని 617 మందితుఫాన్ బాధితులకు శుక్రవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు .మండల పరిధిలోని 16 గ్రామాల్లో 15 పునరావాస్య కేంద్రాల్లో నివాసం కల్పించిన 617 మంది తుఫాను బాధితులకు మండల అధికారులు కూటమి నాయకులు సరుకులను అందజేశారు .దుగ్గిరాల, ఈమని, చిలువూరు గ్రామాల్లోని బాధితులకు బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె, ఉల్లిపాయలు తదితర సరుకులు పంపిణీ చేశారు. తాసిల్దార్ ఐ సునీత ,ఎంపీడీవో ఏ, శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కేజీ నెహ్రూ, ఎంపీపీ షేక్ జబీన్, కే.శ్రీ అనిత, ఝాన్సీ రాణి, రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు, మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, అంచె మారుతి వరప్రసాద్, కాబోతు దేవదాస్, డి.చంటి, ఎడ్ల సాయి కృష్ణ, హర్ష, పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని ఇందిర గాంధీ వర్ధంతి

**తెనాలి, మేజర్ న్యూస్ :** దేశ అభివృద్ధిలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇంచార్జ్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక చిట్టి ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉన్న ఇందిరా గాంధీ గ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శేశి ధర్, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దార రామకృష్ణ, తెనాలి టౌన్ ఉపాధ్యక్షుడు గుర్రపు ద్వారక శ్రీనివాస్, శివకుమార్, భీమా రమేష్, కోటేశ్వరావు, స్టీవెన్ బాబు,శంకర్, శాంతారావు, సుబ్బారావు, కట్టా సతీష్,బి శ్రీను, యన్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.






## తెనాలిలో ఏక్ థా దివస్ ర్యాలీ

**తెనాలి, మేజర్ న్యూస్ :** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయని డీఎస్పీ బి జనార్దనరావు పేర్కొన్నారు. వల్లభాయ్ జయంతిని పురస్కరించుకుని సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఏక్ థా దివస్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని చెంచుపేట లో ఉన్న ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద నుండి మార్కెట్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐలు మల్లికార్జునరావు, రాములు నాయక్, సాంబశివరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల పరిశీలన

**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** మెంథా తుఫాను యొక్క నేపథ్యంలో . ఐ. వెంకట్రావు, జిల్లా ఉద్యాన అధికారి, పల్నాడు జిల్లా ,వారి ఆధ్వర్యంలో మాచర్ల మండలం నందు కొత్తపల్లి , కొప్పునూరు గ్రామాల పరిధి సాగులో ఉన్నటువంటి ఉద్యాన పంటలు పరిశీలన చేయడం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డాక్టర్ బి. నాగేంద్ర రెడ్డి, కీటక శాస్త్రవేత్త, లాం ఫామ్, గుంటూరు వారు గ్రామాల యందు సాగులో ఉన్నటువంటి మిరప, పుచ్చ సాగు ను పరిశీలించడం జరిగినది. అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ మెంథా తుఫాను యొక్క ప్రభావం వలన ఉద్యాన పంటల యందు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించడం జరిగినది.

### మిరప పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు:

మొదటగా మిరప తోటల యందు నీరునిలబడి ఉండకుండా బయటకు వెళ్లే మార్గాలను ఏర్పరుచుకోవాలి. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి. మొక్కలు ఉరుకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలి. వడలిని మొక్కలకు లీటర్ నీటికి ఐదు గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కల్పిన ద్రావణం పిచికారి చేయాలి ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే 10 లీటర్ల నీటికి 50 గ్రాములు అన్న భేది తో పాటు ఒక నిమ్మ చెక్కరసం కలిపి పిచికారి చేయాలి. పై పాటుగా అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా 250 కిలోల వేప పిండి వేయాలి. నేల అధును వచ్చిన వెంటనే గొర్రు అంతర కృషి చేయాలి. మొక్కలు తెరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని ఐదు గ్రాములు లీటర్ నీటికి మరియు సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.50 గ్రాములు లీటర్ నీటికి ఒకదాని తరువాత ఒకటి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకు మచ్చ, కొయినో ఫోర వంటి తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది. కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సిరైడ్ మరియు ఒక గ్రాము స్టెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వీటి వ్యాప్తిని అరికట్టాలి. మిరప పంట ముంపుకు గురై పూర్తిగా పంటకు నష్టం వాటిల్లినప్పుడు పంటను తీసివేసి ప్రత్యామ్నాయంగా వేరొక పంటను సాగు చేసుకోవాలి.

### కూరగాయ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు:

పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపివేయాలి, భోదెలపై లేదా బెడ్లపై నాటుకోవాలి. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై చేయాలి. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలను కూడా పిచికారి చేసుకోవాలి. నేలకొంచెం ఆరిన తర్వాత రసాయనిక ఎరువులను నేలలో వేసుకోవాలి. అధిక వర్షాలను విత్తనం మొలకెత్తినప్పుడు లేదా లేత మొక్కలు దెబ్బ తిన్నప్పుడు నర్సరీలో నారు పెంచుకొని సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసే కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేటట్లు చేసుకోవాలి. మొక్కలకు ఊతం ఇవ్వడం, పందేళ్లపై తీగజాతి కూరగాయలను సాగు చేసుకోవటం వంటివి చేయాలి? సస్య రక్షణ చర్యలు: ఆకు తినే పొగాకు లద్దెపురుగు నివారణకు విషపు ఎరలను ఉపయోగించాలి. (అన్ని కూరగాయ పంటలు) అక్షంతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిఫైరిఫాస్ ఏ 2 మి. లీ./లీ లేదా థయోడికార్బ్ ఏ 1 గ్రా/లీ పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ ఏ 3 గ్రా/లీ లేదా మోటాలాక్సిల్ ం మంకోజెబ్ ఏ 2 గ్రా/లీ ను మొక్కల మొదళ్ళలో పోయాలి (మిరప, టమాటా,



క్యాబేజీ మొదలైనవి) ఆకు పచ్చ తెగుళ్ల నివారణకు కార్బండిజం ఏ 1 గ్రా/లీ లేదా మంకోజెబ్ 2.5 గ్రా/లీ ను పిచికారి చేసుకోవాలి (మిరప, టమాటా, చిక్కుడు, ఆకుకూరలు) బూజు తెగులు నివారణకు డైమిథో మర్ఫ్ ఏ 1.5 గ్రా/లీ లేదా మెటాలాక్సిల్ మంకోజెబ్ ఏ 2.0 గ్రా/లీ ను పిచికారీ చేసుకోవాలి (బీర, కాకర, దోస, పొట్ల, సొర) బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ఏ 3 గ్రా/లీ ప్లాంటా మైసిన్ ఏ 2 గ్రా /లీ కలిపి పిసికారి చేసుకోవాలి (టమాటా, వంగా, క్యాప్సికం),మురుగు నీటిని బయటికి పంపాలి మొక్కలు నీటిలో నాలుగు రోజులకంటే ఎక్కువ ఉన్నట్లయితే వయసుతో సంబంధం లేకుండా వేరే పంటలను వేసుకోవాలి 2-3 మూడుసార్లు 2% యూరియా లేదా 1% పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పిచికారి చేయాలి ప్రాపికొనజాల్ 0.1% మరియు డైఫెన్కోనాజల్ 0.1% ద్రావణాలను రెండు సార్లు వారం వ్యవధిలో మార్చి మార్చి పంట పైన పిచికారి చేసినట్లయితే ఆకుమచ్చ మరియు తాటాకుమచ్చ తెగులను నివారించవచ్చు. సూక్ష్మ పోషకాలు మిశ్రమాన్ని 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయి. కార్యక్రమంలో మోహన్, మాచర్ల, గ్రామ ఉద్యాన సహాయకులు వెంకటేశ్వర్లు, తులసి నాయకు మరియు రైతులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయులు

## జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడి భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలిపిన దేశ సమైక్యత శిల్పి మహనీయులు దేశ ప్రథమ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయులని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. శుక్రవారం కీ.శే. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని శ్రీమతి కాసు సాయమ్మ మున్సిపాల్ హై స్కూల్ ప్రాంగణంలో జాతీయ ఐక్యత దినోత్సవ సభ ఘనంగా జరిగింది. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ స్వాతంత్రం అనంతరం 562 సంస్థానాలను విలీనం చేసి జాతీయ ఐక్యతను కాపాడిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందన్నారు. 22 అధికార భాషలు, 20 వేల మాతృ భాషలు కలిగి 3 వేలకు పైగా కులాలు, 25 వేలకు పైగా ఉప కులాలు, విభిన్న మతాలు, సంస్కృతులు, ఆచారాలు, సాంప్రదాయాలతో కొనసాగుతున్న భారతదేశాన్ని సమైక్యంగా ఉంచడంలో భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి ని భారతీయులు మరువలేరన్నారు. 2014 నుండి భారతదేశంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. 600 అడుగుల ఎత్తుతో గుజరాత్ లోని నర్మద నది తీరాన సర్దార్ సరోవర్ డ్యాం ఎదురు సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఐక్యత ప్రతిమగా నిర్మించుకున్నామని ఇది దక్షిణ ఆసియాలో కెల్లా ఎత్తైన విగ్రహంగా వర్ణించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తుమ్మూరి విజయ్ కృష్ణ ప్రసంగిస్తూ భారతీయులందరూ కుల, మత ప్రాంతాలకు అతీతంగా సమిష్టిగా కృషి చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. హిందూ మత గొప్పతనాన్ని వివరిస్తూ అన్ని సంస్కృతులను కలుపుకొని వెళ్లే శక్తి హిందూ మతానికి ఉందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ కోట శ్రీనివాసరావు ప్రసంగిస్తూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన కృషిని వివరించారు. కేంద్ర హెూం మంత్రిగా, దేశ ప్రథమ ఉప ప్రధానిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేసి అఖండ భారతదేశాన్ని నిర్మించారన్నారు. ఇస్లాం మత విశిష్టతను అబ్దుల్ రషీద్, క్రైస్తవ మత ప్రాముఖ్యతను కోల జ్యోషి వివరించారు. మానవత నేత కొరిటపాటి పావని స్వాగత ఉపన్యాసం చేస్తూ నేటి విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ త్యాగ నిరతిని, పోరాట పటిమని, దేశ సమగ్రత కోసం చేసిన కృషిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాసు సాయమ్మ మున్సిపాల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ జిలాని ప్రసంగిస్తూ 1948లో ఆపరేషన్ పోలో పేరుతో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషిని మరువ లేమన్నారు. ఈ కార్యక్రమంలో మానవత నేతలు చావా శివాజీ, లక్ష్మీ సామ్రాజ్యం, యలమంచలి శివాజీ, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని కొరిటపాటి సుస్మిత తదితరులు ప్రసంగించారు. దాదాపు 300 మంది విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు.

# మున్సిపల్ కార్యాలయంలోని పార్కులో పార్కులో గుమ్మడి కళా పీఠం



వినుకొండ మేజర్ న్యూస్: నియోజకవర్గం కమిటీ సభ్యుల సమావేశం జరిగింది ఈ సందర్భంగా జరిగిన సభలో గుమ్మడి కళాపీఠం ప్రధాన కార్యదర్శి దేవరపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కళాకారులను ఏకం చేసి జనవరిలో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని తీసుకొని ప్రభుత్వ పెద్దలకు రాష్ట్రంలో ని కళాకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించాలని తెలిపారు కళాకారులు ఐక్యం కావలసిన సమయం ఆసన్నమైనదని కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా కళాకారులు ఇబ్బందులు తొలగించాలని ప్రజల ప్రాణాలను హరిస్తున్న డీజే లను రద్దుచేసి తద్వారా వాయిద్య కళాకారులకు అవకాశాలు ఏర్పాటు చేయాలని మండలానికి ఒక కళాకారుల కాలనీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు భీమవరపు ఏడుకొండలు నిడమనూరి వెంకట సుబ్బారావు మరియు 5 మండలాల గుమ్మడి కళా పీఠం కార్యవర్గం పాల్గొన్నారు.

# విధ్వంసం కోరుకునే మనస్తత్వం జగన్‌ది

## ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



**పెదకాకాని మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మొంతా తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడం అధికార యంత్రాంగాన్ని సకాలంలో అప్రమత్తం చేయడం వలనే ప్రాణ నష్టాన్ని తగ్గించగలిమని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారిని వెంటనే గుర్తించి, పునరావాస శిబిరాలకు తరలించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షణకు నియమించడం ముఖ్యమంత్రి నిరంతరం సమీక్షలు నిర్వహించడం వల్ల అధికార యంత్రాంగం వెంటనే స్పందించిందని పేర్కొన్నారు. నెల్లూరులోని సంగం బ్యారేజీ వద్ద బోటు ఇరుక్కుపోవడం వంటి సంఘటనలను కూడా అధికారులు తక్షణమే పరిష్కరించారని, ఎన్డీఆర్‌ఎఫ్ సహకారంతో వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురాగలిగామని వివరించారు. ఈ విజయం అంతా ప్రభుత్వ అప్రమత్తత, నిరంతర పర్యవేక్షణ వల్లే సాధ్యమైందని స్పష్టం చేశారు. ఇటువంటి ఆపద సమయంలో ప్రభుత్వానికి ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలు చాలా బాధ కలిగిస్తున్నాయని విమర్శించారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎన్నో తుపానులు వచ్చినా, వేలాది ఎకరాల పంట నష్టం జరిగినా ఆయన ఎప్పుడూ పంట చేనులో కాలు పెట్టని వ్యక్తి అని ఆక్షేపించారు. ప్రస్తుతం బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని సమీక్షలు జరిపి తుపాను రావడం ప్రభుత్వ వైఫల్యం వల్లేనని చెప్పడం ఆయన కనీస ఆలోచనా రహితాన్ని చూపుతుందని అన్నారు. తుపానులు ఎవరికీ చెప్పి రావని, వాటిని ఆపడం ప్రభుత్వాల వల్ల లేదా మనుషుల వల్ల సాధ్యం కాదని గుర్తు చేశారు. కాకపోతే తుపాను వల్ల జరిగే ప్రాణ నష్టాన్ని ఆపడం, ప్రజలను అప్రమత్తం చేసి పునరావాసం కల్పించడం వంటివి మాత్రమే ప్రభుత్వాలు చేయగలవని తెలిపారు. జగన్ కేవలం రాజకీయ కోణంలోనే మాట్లాడుతున్నారని, ప్రభుత్వంపై నిరంతరం బురద జల్లి రాజకీయ ప్రయోజనం పొందాలనే ఆలోచన తప్ప, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి రైతులతో మాట్లాడి వారికి మనోధైర్యాన్ని ఇవ్వడం గతంలోనూ చూశామని తెలిపారు. గతంలో పంట నష్టం జరిగితే వారం రోజుల్లోనే పరిహారం రైతుల అకౌంట్లలో జమ చేశామని ఈసారి కూడా పంట నష్టం వివరాలు సేకరించి త్వరలోనే నష్టపరిహారం చెల్లించడానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ముందస్తుగా క్యాంపులకు తరలించిన వారికి తక్షణ సాయంగా రూ. 3,000, నిత్యావసర వస్తువులు ఇచ్చామని తెలిపారు. జగన్ హయాంలో పంట నష్టం జరిగినా కొన్న ధాన్యానికి కూడా నెలల తరబడి డబ్బులు ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 1,100 కోట్లు రైతుల అకౌంట్లలో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతాంగం కోసం పనిచేసే ప్రభుత్వమని, ఇన్సూరెన్స్ కట్టినా కట్టకపోయినా నష్టపోయిన ప్రతి ఎకరాకు పరిహారం ఇస్తామని, నష్టపోయిన పంటను కొంటామని హామీ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డికి విధ్వంసం చేయడం అలవాటు అయిపోయి.. విధ్వంసం జరిగితే ఆనందించాలనే మనస్తత్వం కనిపిస్తోంది. ఐదేళ్లలో చేసిందంతా విధ్వంస పాలనే కానీ ఈ ప్రభుత్వం ప్రజల కష్టాలను తెలుసుకొని వారికి మనోధైర్యాన్ని ఇచ్చి వారిని ఆదుకుంటుందని స్పష్టం చేశారు.



# కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలి

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని పటాన్ నాగులు మీరా అన్నారు.మండల కేంద్రమైన పెదకూరపాడులో హమాలీల గోడౌన్ వద్ద ఏఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏఐటియుసి అరుణ పథకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాగులు మీరా మాట్లాడుతూ స్వతంత్రం రాకముందు ఏఐటియుసి నాయకులు పోరాట ఫలితంగా అనేక కార్మిక చట్టాలు వచ్చినాయి అన్నారు దేశ స్వతంత్ర పోరాటంలో ఏఐటీయూసీ విరోచితంగా పోరాటం చేసిందన్నారు నేటి పాలకులు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ 29 కార్మిక చట్టాలను తీసివేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారన్నారు వెంటనే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలన్నారు విశాఖ బుక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీల్ సంఘం నాయకులు తేల ప్రసాదు, సుధాకర్, రతన్ రాజు, ఏడుకొండలు,చిన్ని శేఖర్ యాకోబు,శివ కోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎస్. హెచ్. ఓ.లో వినాళ గ్రంథుల వ్యాధుల

# ఉచిత వైద్య సలహా శిబిరం



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** మధుమేహ నిరోధక మాసం సందర్భంగా నవంబర్ నెల రెండవ తేదీ ఆదివారం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 2/1 బ్రాడీపేట లో గల ఎస్. హెచ్ .ఓ సమావేశ మందిరంలో వినాళ గ్రంథుల (ఎండోక్రైనాలజీ )ఉచిత వైద్య సలహా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్ ,పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు .ఆదివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వి.బి. కాశ్యప జన్నాభట్ల పాల్గొంటారన్నారు. మధుమేహం, ఊబకాయం, (ఒబిసిటీ) థైరాయిడ్ పిట్యూటరీ, అడ్రినల్, ప్యాంక్రియాస్, ఓవరి, టెస్టిస్ మొదలగు వినాళ గ్రందుల వ్యాధులు, సమస్యలతో బాధపడుతున్న వారు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవలసిందిగా జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు

# అందజేసిన ఎస్సై తిరుపతిరావు

**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం పోలీస్ స్టేషన్ లో పోగొట్టుకున్న 5 సెల్ ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని మాచవరం ఎస్సై తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. మాచవరం గ్రామానికి చెందిన పగిడిపల్లి తిమోతి , గంజి వెంకటేష్, కుర్ర హుస్సేన్ మోర్జంపాడు కు చెందిన నవులూరి విష్ణువర్ధన్ రెడ్డి లఫోన్లు సుమారు 1 సంవత్సరం క్రితం ఈ సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు వెంటనే మాచవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసుకొని సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి సిగ్నల్స్ ఆధారంగా సెల్ఫోన్లను రికవరీ చేశామని ఎస్సై తిరుపతిరావు తెలిపారు. బాధితులకు సెల్ఫోన్ అందించిన వారిలో ఎస్సై తిరుపతిరావు తో పాటు ట్రైనింగ్ ఎస్సై గడ్డం అబ్రహం ఉన్నారు. సెల్ ఫోన్లు లబ్ధిదారులు స్థానిక పోలీసులకు అభినందనలు తెలియజేశారు అలాగే మీ సెల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసి ఆ ఫోన్ కు సంబంధించిన వివరాలను తమకు తెలియజేయాలని ఎస్సై తిరుపతి రావు సూచించారు.

# కలెక్టరేట్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు





**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, జాతీయ ఐక్యతకు పునాది వేసిన భారతదేశపు ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి నీ ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆయన సేవలను కొనియాడారు. కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## లగడపాడులో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని లగడపాడు గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి వేడుకను శుక్రవారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నందూరి సురేష్ మరియు ఉపాధ్యాయులు పాటిబండ్ల శిరీష ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.జాతీయ ఐక్యతా దివస్ పటేల్ గొప్పదనం గురించి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వివరించారు.అనంతరం విద్యార్థులందరి తో జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ లగడపాడు బ్రాంచ్ మేనేజర్ గంగాధర్ పాల్గొని స్వతంత్ర భారత తొలి హోంమంత్రిగా దేశాన్ని ఐక్యం చేసి మనలో సమైక్య స్ఫూర్తిని నింపిన ఉక్కు మనిషి శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. పాఠశాల పూర్వ విద్యార్థి చేనేత సంఘం నేత చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ భారతదేశపు ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రముఖ స్వాతంత్ర్య యోధుడి గానే కాకుండా స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు భారతదేశములో విలీనం కావడానికి గొప్ప కృషిచేసి సఫలుడైన ప్రముఖుడిగా పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులందరికి పెన్నులు బహూకరించారు.



## తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సహాయం అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ మేజర్ న్యూస్:** 'మొంథా' తుఫాన్ కారణంగా నూజెండ్ల మండలం ఉప్పలపాడు ఎస్టీ కాలనీ వరద బాధితులను అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు పునరావాస కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వ సాయాన్ని అందించారు. 22 మంది బాదిత కుటుంబాలకు నిత్యవసరాల సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందించారు. వరద బాధితులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, ఇల్లు లేని ప్రతి పేదకు ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు, పక్కా ఇల్లు కూడా నిర్మించేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిడిసిసి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**తెనాలి, మేజర్ న్యూస్** అగ్ని ప్రమాద బాధితులకు తెలుగు విద్యార్థి విభాగం అండగా నిలిచింది. స్థానిక నందులపేటలో గత కొద్ది రోజుల క్రితం సంభవించిన అగ్ని ప్రమాదంలో దేవరకొండ నాగేంద్రమ్మ అనే మహిళ గృహంలో షార్ట్సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఇంట్లో వస్తువులు కాలిపోయాయి. ఆర్థికంగా నష్టపోయిన ఆమెను తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశానుసారం తెనాలి నియోజకవర్గ తెలుగు విద్యార్థి విభాగ అధ్యక్షులు పుట్టి అన్వేష్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కొల్లూరు శ్రీధర్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పాలడుగు ప్రణీత్, యువత నాయకులు గోళ్లముడి శ్రీను, నాగమోతు నవీన్, విద్యార్థి నేత పాలడుగు హనిత్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా దర్బార్ లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ:** పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు.నియోజకవర్గంలోని పలు మండలాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విజ్ఞప్తులను సావధానంగా ఆలకించిన జీవీ , వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుందని, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం వల్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.. ప్రజా సమస్యల పరిష్కా తాను ఇప్పుడు ముందు ఉంటానని వారికి సేవ చేసుకునే భాగ్యం దొరికినందుకు ఆనందంగా ఉందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నాగ శీను రాయల్, కూటమి నాయకులు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# జన్ మన్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి





**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** జిల్లాలో చెంచుల నివాస ప్రాంతాల్లో ప్రధాన మంత్రి జన్ మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. జన్ మన్ పథకం కింద 708 ఇళ్లు మంజూరు కాగా 324 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, 384 ఇళ్లు వివిధ దశల్లో పెండింగ్ లో ఉన్నాయని హౌసింగ్ అధికారులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.పీఎంఏవై గ్రామీణ్ 2.0 సర్వేను నవంబరులోగా పూర్తి చేయాలన్నారు. పీఎం ఆవాస్ అర్బన్, గ్రామీణ్, జన్ మన్ పథకాల కింద వివిధ దశల్లో పెండింగ్ లో ఉన్న 25,057 ఇళ్లకు గానూ 5,486 ఇళ్ల నిర్మాణాలు గణతంత్ర దినోత్సవం నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. మూడు పథకాల కింద మొత్తం 50,174 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకూ 25,117 ఇళ్లు నిర్మించామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇంచార్జ్ పీడీ శివలింగం, హౌసింగ్ శాఖ ఈఈ లు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలను ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి



**వినుకొండ మేజర్ న్యూస్ :** సీఎం సహాయనిది పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 40 మంది లబ్ధిదారులకు, 26 లక్షలు 73 వేలు చెక్కులను శుక్రవారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ కి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో,డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు కౌన్సిలర్లు,నాయకులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ల పరిశీలనలో కమిషనర్‌ను అభినందిస్తున్న ప్రజలు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్లకు ప్రజలు విస్తృతంగా వస్తున్నారని, వారికి తగిన విధంగా ఆహారం అందేలా ఇండెంట్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లకు స్థానిక పేదలు, రోజువారీ కార్మికులు అధిక సంఖ్యలో వస్తున్నందున అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. క్యాంటీన్ పరిసరాల్లో పారిశుధ్యం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ల పర్యవేక్షణలో కమిషనర్ పులి శ్రీనివాసులు చేస్తున్న కృషిని ప్రజల వినిందిస్తున్నారు. అక్షయపాత్ర సిబ్బంది జిఎంసి నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

# వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలి, మహిళా సాధికారత, ఆర్థిక స్తోమత పెంచాలి

## కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. వరకట్న నిషేధ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం వారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఎక్కువ అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయం స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక స్తోమత పెంచడం అవసరం అన్నారు. వివాహం తర్వాత విధిగా నమోదు జరగాలని స్పష్టం చేశారు. వరకట్న నిషేధ చట్టం ద్వారా వరకట్నం అడగటం, తీసుకోవడం నేరమని, 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.15 వేల వరకు అపరాధ రుసుం వేయడం జరుగుతుందని చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన – వరకట్న నిషేధ చట్టం వివరాలను తెలిపారు. జీ.ఓ.28 ప్రకారం బాధితులకు నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గృహ హింస చట్టం కింద 2022 సంవత్సరంలో 666 కేసులు, 2023లో 588, 2024లో 483 కేసులు, 2025లో 446 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రామకృష్ణ, న్యాయ సలహాదారు విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే

- ఆలయాల అభివృద్ధి బాధ్యతగా తీసుకోండి
- అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి
- ప్రణాళికాబద్ధంగా ప్రతిపాదనలు రూపొందించండి





**గుంటూరు జిల్లా మేజర్ న్యూస్ :** తూర్పు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల కార్యాలయంలో ఎండోమెంట్ అధికారులతో ఎమ్మెల్యే నసీర్ సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లాలాపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి 3.6 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, దీని కోసం ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. రైలు పేటలోని ఆంజనేయ స్వామి ఆలయ పునర్నినిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. పాత గుంటూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ మండపం, మరుగుదొడ్లు, సీతా రామ సేవా మండలి పైకప్పు, పునాది మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కృష్ణ మందిరం కోసం భూగర్భ జల పారుదల, పంపింగ్ వ్యవస్థ సరి చేయాలన్నారు. ఆలయ ఆస్తి కేసులను వేగవంతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూనేవారి సత్రం, సిద్ధాబత్తుని కోమలంగమ్మ, ఉదాసి మఠం ఆలయ భూమి ఆక్రమణ, టైటిల్ వివాదాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అన్నదానం, చలివేంద్రం కార్యక్రమాలను కొనసాగించాలని, పునర్నిర్మాణ పనులలో దాతల భాగస్వామ్యం, విద్యా స్కాలర్‌షిప్‌లను ప్రోత్సహించడం చేయాలని చెప్పారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జయంతి వేడుకలు



**ప్రత్తిపాడు మేజర్ న్యూస్ :** పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు మరియు స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని, హోమ్ మినిస్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నేషనల్ యూనిటీ డే గా సెలబ్రేట్ చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ జి వీర రాఘవయ్య విద్యార్థులకు సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు భారతదేశానికి చేసిన సేవలను వివరించినారు. భారతదేశ స్వాతంత్రానంతరం కూడా ఎన్నో సంస్థానాలు భరత్ లో విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండిపోయాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు వాటన్నిటిని భరత్ లో విలీనం చేయటానికి విశేషంగా కృషి చేసినారు ముఖ్యంగా హైదరాబాద్, జునాగడ్ సంస్థానాలను భరత్ లో కలపడానికి వారు వారు ఎంతో కృషి చేసినారని చెప్పారు. అధ్యాపకులు విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించినారు.

# మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇ.డిగా షై జుద్దీన్



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేష న్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా షేక్ షై జుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏ.తమీ మ్ అన్సారియాను మర్యాద పూ ర్వకంగా కలిశారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా డిప్యూటేషన్ పై ఇప్పటి వరకూ పనిచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా నియమితు లయ్యారు.

# దుర్గి మండలంలో ఆధునిక సాగు పద్ధతులక ప్రోత్సాహం - అధికారులు పర్యటన



**దుర్గి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దుర్గి మండలం పరిధిలోని పలు గ్రామాలలో ముఖ్యమంత్రుల విప్లవాత్మక పథకాలతో మేళవించిన పాలసీలు, సుదృఢత, ప్రజాసేవ తాలూకు విజయాలను వివరించేందుకు దుర్గి మాండల పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారి అమీర్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ ఎం. నాగేష్ జిల్లా ఎరువాకా కోఆర్డినేటర్ మరియు పి.వి. సత్యగోపాల్ ప్రధాన శాస్త్రవేత్త, విస్తరణ విభాగం సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రైతుల సమస్యలపై చర్చిస్తూ, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పంటల ఎండుగాలులపై అవగాహన కల్పించారు. తదుపరి, రైతు కె. వీరయ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, ఒక ఎకరా మక్కజొన్న పంటను పరిశీలించారు. పంట పెరుగుదల పరిస్థితి సంతృప్తికరంగా ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం మహిళా రైతు మాధవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధునాతన పద్ధతుల్లో సాగు బీటీఫ్ కాటన్ పంటను పరిశీలించారు. 20 రోజుల డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ద్వారా 150 లీటర్ల నీటిని వినియోగిస్తున్న పద్ధతి పర్యావరణానికి అనుకూలమని ప్రశంసించారు. రైతుల ఉత్పాదకతకు 6 నెలల్లో 20% పెరుగుదల సాధ్యమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు సాంకేతిక సూచనలు అందించారు. దుర్గి మండల వ్యవసాయ విభాగాధికారి అమీర్ రెడ్డి మరియు VAA ల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆర్.వి.ఆర్ లో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** సమైక్య భారత నిర్మాతగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని ఆర్.వి.ఆర్ మరియు జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నాడు స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ మరియు జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది **"ఏక్తా దివాస్"** పేరుతో ప్లె కార్డులు ప్రదర్శిస్తూ కళాశాల ప్రాంగణం నుండి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అందరూ దేశ ఐక్యత, సమైక్యత, జాతీయ అభివృద్ధి కోసం ప్రతిజ్ఞ చేశారు. వల్లభ్ భాయ్ పటేల్, భారత దేశ తొలి ఉప ప్రధానిగా, తొలి హోమ్ శాఖా మంత్రిగా పని చేసిన తన పదవీ కాలంలో భారత దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తనదైన పద్ధతితో పరిష్కరించి, సంస్థానాలు భారతదేశములో విలీనం చేసి ఉక్కు మనిషిగా కీర్తింపబడ్డారని కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ మరియు ఆర్ అండ్ డి డైరెక్టర్ డా. కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ మరియు అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాస రావు, కళాశాల యెన్ ఎస్ ఎస్ యూనిట్స్ కో–ఆర్డినేటర్స్, కళాశాల యెన్ సి సి యూనిట్స్ ఆఫీసర్స్ అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలి



**పెదకాకాని మేజర్ న్యూస్ :** గత సంవత్సరం పండించిన పంటలకు రేటు లేక పెట్టుబడి సాయం అందక నష్టాలపాలై అప్పులు చేసి ఈ సంవత్సరం వేసిన అపరాల పంటలు మొలక దశలోనే మొంథా తుఫాను వల్ల ముంపుకు గురై, ఉడకెత్తడం వల్ల రైతులు పంట నష్టపోయారని, పెట్టుబడి కోసం చేసిన అప్పు పెను భారంగా మారి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఉచిత క్రాప్ ఇన్సూరెన్స్ ప్రభుత్వం చేసి ఉంటే రైతుకు కొద్దిపాటి ఊరట దొరికేదని ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోయారని పొన్నూరు వైసీపీ సమన్వయ కర్త అంబటి మురళి పేర్కొన్నారు శుక్రవారం పెదకాకాని మండల నాయకులతో రైతులతో కలసి మండలంలో ముంపుకు గురైన అపరాల పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టం సంభవించిన ప్రతి రైతునీ ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని నష్ట పోయిన ప్రతి ఎకరాకూ తక్షణ సాయం కింద రూ 20,000, మరో రూ30,000 వడ్డీలేని ఋణం ఇచ్చి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం తక్షణ బాధ్యతగా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గత వైసీపీ పాలనలో రైతు సంక్షేమం దృష్టా ఉచిత పంటల బీమా కోసం 7000 కోట్లు ప్రభుత్వం చెల్లించి, ప్రతి సంవత్సరం రైతు భరోసా రూపంలో పెట్టుబడి సాయం అందించి రైతులకు వ్యవసాయం పై భరోసా ఇచ్చిందని గుర్తు చేశారు పంట నష్టం సంభవించిన ప్రతి రైతు వివరాలు పారదర్శకంగా నమోదు చేసి ఎలాంటి వివక్షా లేకుండా నష్టపరిహారం అందజేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులూ పాల్గొన్నారు.

– అంబటి మురళీకృష్ణ

# ఏపీయూడబ్ల్యూజే నగర కమిటీ సమావేశం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఏపీయూడబ్ల్యూజే గుంటూరు నగర కమిటీ సమావేశం శుక్రవారం గుంటూరు బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో నగర అధ్యక్షుడు కొంగర వెంకయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, రైల్వే రాయితీ పాస్‌లు, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రెస్ క్లబ్ ఏర్పాటు, జర్నలిస్టులపై దాడులు నివారణపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు చేపట్టాలని, నవంబర్ 17న జర్నలిజం దినోత్సవం సందర్భంగా ఏపీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించాలని తీర్మానించారు. ప్రతి నెలా నగర కమిటీ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కమిటీ హోదాదారులు కె.తిరుపతి రెడ్డి, కె.వెంకయ్య, బి.వై.రెడ్డి (కార్తీక్), భవిరిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల వీరభద్రరావు, సుభాని, కె. సుజిబాబు, జి. అప్పారావు, రాంబాస్కర్, రఘునాథ్ రెడ్డి, లూర్ధరాజు, సుబ్బారావు, వహీద్, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ను కలిసిన టూ టౌన్ సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి నరసరావుపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన సీహెచ్ ప్రభాకర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే సిఐ కి శుభాకాంక్షలు తెలిపి శాంతి భద్రతల పరిరక్షణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

## జి.ఎస్.టి శాఖ కే గర్వకారణం ఎం. నాగరాజు

### – సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్



**గుంటూరు, విద్య మేజర్ న్యూస్ :** కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, జీఎస్టీ శాఖలోని ఐ.ఆర్.ఎస్ అధికారి ఎం. నాగరాజు అందించిన సేవలు డిపార్ట్మెంట్ లో చిరస్థాయిగా నిలిచిపోతాయని సెంట్రల్ జి. ఎస్. టి కమిషనర్ సుజిత్ మల్లిక్ పేర్కొన్నారు. శుక్రవారం పలకలూరు రోడ్ లోని గుంటూరు క్లబ్ లో జరిగిన జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎం. నాగరాజు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దీనికి రిటైర్డ్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ సి. పి. రావు అధ్యక్షత వహించారు. కమిషనర్ సుజిత్ మల్లిక్ మాట్లాడుతూ.. నాగరాజు శాఖ పరంగా ఎన్నో ప్రభుత్వ అవార్డులు, రివార్డులు పొంది శాఖకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఉద్యోగ సంఘ నేతగా ఉద్యోగుల సంక్షేమానికి మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ కాలం విశ్రాంతికే కాకుండా, శాఖ అభివృద్ధికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. రిటైర్డ్ చీఫ్ కమిషనర్ సి. పి. రావు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో దక్షత, సమర్ధత, విశ్వాసనీయత కలిగిన అధికారి నాగరాజు అని ప్రశంసించారు. ఆయన ఉద్యోగ అనుభవాన్ని ఇతరులకు పంచాలని విజ్ఞప్తి చేసారు. జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నాగరాజు సేవలు సాటిలేనివన్నారు. ఆయన పనితీరు ఉద్యోగులందరికీ మార్గదర్శకమన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసి జీఎస్టీ శాఖలో సుస్థిరమైన స్థానాన్ని నాగరాజు పొందకలిగారన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఎం. నాగరాజు మాట్లాడుతూ..విధుల పట్ల అంకితభావం, బాధ్యయుతంగా పనిచేస్తే, ఏ ఉద్యోగికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగరాజును పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగులు సత్కరించి, జ్ఞాపికలు బహుకరించారు. కార్యక్రమంలో మాజీ ఎం. ఎల్. సి పందుల రవీంద్ర బాబు, గజిటెడ్ అధికారుల సంఘ నాయకులు గాదె శ్రీనివాస రెడ్డి, కె. యుగంధర్ కుమార్, బి. నవీన్ రాజు, సూర్యదేవర రమేష్ బాబు మినిస్టీరియల్ సంఘ నేతలు శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్ కుమార్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు టి. వివేకానంద, గద్దె తిలక్, పి.వి.సత్యనారాయణ, పి.ఎన్.వి. ప్రసాద్, గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముప్పాళ్ల మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటన

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** ముప్పాళ్ల మండల పరిధిలోని ఇరుకుపాలెం గ్రామంలో సామాజిక ఫంచన్‌ల పంపిణీ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల పర్యటించనున్నారని ఎంపిడిఓ రత్నం తెలిపారు. మండల పరిధిలో ని అన్ని గ్రామాలలో ఉదయం 6 గంటలకు పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. పించన్ల పంపిణీ అనంతరం కలెక్టర్ రెండు, మూడు సచివాయాలను సందర్శించే అవకాశం ఉందని అందరూ సంసిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

# ఘనంగా "సర్దార్ @150 యూనిటీ మార్చ్" ర్యాలీ

### సర్దార్ వల్లభాయ్ పటేల్ మహెూన్నతుడు – రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్







**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** సర్దార్ వల్లభాయ్ పటేల్ మహెూన్నతుడని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో శుక్రవారం **"సర్దార్ @150 యూనిటీ మార్చ్"** ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ సమైక్య దినోత్సవం)లో భాగంగా ర్యాలీని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రభుత్వ మహిళా కళాశాల వరకు పెద్ద ఎత్తున సాగింది. మంత్రి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ప్రభుత్వ మహిళా కళాశాల వరకు సాగింది. కళాశాలలో జరిగిన సమావేశంలో అతిధులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు స్వర్ణాక్షరాలతో లిఖించవచ్చని అన్నారు. వల్లభాయ్ పటేల్ ను ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కీర్తించడం జరిగిందని చెప్పారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ ఐక్యతను సాధించిన మహానేతగా ఆయనకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. భారత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 562 దేశీయ సంస్థానాలను భారత రాజ్యాంగంలో విలీనం చేయించడంలో ఆయన అద్భుత కృషి మరువలేనిది అన్నారు. ధైర్యం, తెలివితేటలు, చర్చా పటిమతో ఈ మహత్తర కార్యక్రమాన్ని పూర్తి చేశారని కొనియాడారు. గుంటూరు తూర్పు శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రభావంతో స్వాతంత్ర్య ఉద్యమంలో చేరడం జరిగిందన్నారు. నాయకుడిగా ఆయన రైతులు, కార్మికులు, ప్రజల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అన్నారు. గుంటూరు పశ్చిమ శాసన సభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ సర్దార్ పటేల్ పరిపాలనలో క్రమశిక్షణ, న్యాయం, ప్రజాస్వామ్య విలువలు ప్రధానమయ్యాయని వివరించారు. ఆయన భారత పరిపాలన వ్యవస్థకు బలమైన పునాది వేసారని. ఆయన ఆలోచనలు, సేవలు నేటికీ భారత రాజకీయ నాయకులకు ప్రేరణగా నిలుస్తున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేవలం నాయకుడే కాదని, దేశ ఐక్యతకు చిహ్నం అన్నారు. ధైర్యం, దేశభక్తికి ప్రతీక అని, ఆయన త్యాగం, కర్తవ్య నిబద్ధత, దృఢ సంకల్పం భారత యువతకు ప్రేరణ అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, నగర పాలక సంస్థ కమిషనర్ పులి.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్మయి దేవిరెడ్డి, స్థానిక నాయకులు తిరుపతి రావు, జిల్లా అధికారులు, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ పాండురంగ విట్టల్ బజరంగ్ రామకృష్ణ, బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోనల్ ఇంచార్జ్ నాగోతు రమేష్ నాయుడు, బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ర శివన్నారాయణ, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కాపాడాలంటూ వినుకొండ లో ధర్నా...!



**2.కోట్లు విలువ చేసే ప్రభుత్వభూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకుని ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, పల్నాడు జిల్లా కలెక్టర్, వినుకొండ పట్టణ కమిషనర్ ఆదేశాలను లెక్కచేయని ఆక్రమణదారులు**

**వినుకొండ మేజర్ న్యూస్ :** వినకొండ పట్టణం లో కోట్లాది రూపాయల భూమి కబ్జా చేశారు కాపాడండి అంటూ వినుకొండ క్రిస్టియన్ పాలెం కు చెందిన ప్రజలు స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్ళు గా ఆ ప్రాంతంలో మహిళ ల కొరకు సామూహిక మరుగుదొడ్లు అప్పటి గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిందని ఆ మరుగుదొడ్లు కూల్చి వేసి అక్రమణ చేశారని అప్పటి మున్సిపల్ కమిషనర్ కేసు నమోదు చేసి పెన్సింగ్ వేశారని మరలా ఆక్రమణ చేశారని ప్రభుత్వ అస్తి కాపాడి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. వివరాలు పరిశీలిస్తే వినుకొండ నియోజకవర్గం వినుకొండ పట్టణం ప్రస్తుత 27 వ వార్డు క్రిస్టియన్ పాలెంలో సర్వే నెంబర్ 390/1ఏ 1లో షుమారు రెండు ఎకరాలు ప్రభుత్వ భూమి గ్రామాకంఠం ఉన్నది. ఈ భూమి విలువ సుమారు ప్రభుత్వ విలువ 2 కోట్లుగా బహిరంగ మార్కెట్ లో 10 కోట్లు గా ఉంటుంది. గత కొన్ని సంవత్సరాలు క్రిందట క్రిస్టియన్ పాలెం, ఒబయ్య కాలనీ, ముస్లిం బిసి యస్ టి వర్గాల మహిళలతో పాటు వార్డు మహిళలు బహిర్భూమి అవసరాల నిమిత్తం కొరకు అప్పటి ప్రభుత్వం మరుగుదొడ్డుని నిర్మించింది. ఆక్రమణదారులకి ఎప్పటి నుండో ప్రభుత్వ స్థలం మీద కబ్జా చేయాలని కన్ను ఉంది వారు సుమారు ఐదు సంవత్సరాల క్రిందట అక్కడ నిర్మించిన మరుగుదొడ్డిని మరియు క్రిస్టియన్ పాలెం వాసులకు చెందిన కొందరి సమాధులను జె.సి.బి సహాయంతో పడగొట్టారు మేకా రాజగోపాల్ అనే రియల్టర్ ఈ ఆక్రమణ లకు వెన్ను దన్నుగా నిలిచి ఆక్రమణదారులతో కోట్ల రూపాయలకు ఒప్పందాలు చేసుకుని ఆక్రమణ చేశారు. స్థానికులు ఆదోళన లు చేయడం తో అప్పటి కమీషనర్ బి.శ్రీనివాసరావు ఆక్రమణదారులపై క్రిమినల్ కేసు నమోదు కు టౌన్ పోలీసులకు లేఖ రాశారు. ఇది ప్రభుత్వ భూమి అని వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్ నందు CR.NO 187/2019 నమోదు జరిపించారు. అప్పటి కమిషనర్ బి.శ్రీనివాస్ రావు ఈ భూమిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ కట్టాలని ప్రపోజల్ చేశారు. ఈ కేసు లో పోలీసులు ఛార్జ్ షిట్ దాఖలు చేశారు వినుకొండ కోర్టులో కేసు విచారణ జరుగుతుంది. ఆక్రమణదారులు గత సెప్టెంబర్ నెలలో 19వ తేదీన కొందరు ఆక్రమణదారులు జె.సి.బి మరియు ట్రాక్టర్స్ తో మరలా దురాక్రమణ చేశారు. ఈ విషయం పై స్థానికులు అనేకమార్లు ప్రభుత్వ చీఫ్ వినుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు ని కలిశారు. ఆ భూమి క్రిస్టియన్ పాలెం వార్డు ప్రజల యొక్క అవస రాలకు ఉపయోగిస్తానుని హామీ ఇచ్చారు కలెక్టర్ కు కూడా ఫిర్యాదు చేశారు జిల్లా కలెక్టర్ ఆర్ డి ఓ కు విచారణ కు ఆదేశించారు. వినుకొండ కమిషనర్ గారు ఇది ప్రభుత్వ భూమి అన్ని బోర్డు ఏర్పాటు చేసి పత్రికా ప్రకటన విడుదల చేశారు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆ స్థలం స్వాదినం చేసుకునే టప్పుడు పోలీస్ బందోబస్త్ ఇవ్వాలని లేఖ పంపారు. అయినప్పటికీ ఆక్రమణ దారులు ఆ బోర్డును తొలగించి యదేచ్ఛగా ప్రభుత్వ భూమిలో పగలు మరియు రాత్రి పనులు చేసుకుంటున్నారు స్థానిక ప్రజలలు వారిని ప్రశ్నిస్తే చంపుతాం అని బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అధికారులు స్పందించి క్రిస్టి యన్ పాలెం లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాల ని స్థానిక ప్రజలు మున్సిప ల్ కార్యాలయం ఎదుట కూర్చుని ప్రభు త్వ భూమి కాపాడాలంటూ నినా దాలు చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి క్రిస్టియన్ పాలెం వాసులు అక్కడ ఫంక్షన్లు గాని మీటింగులు జరుపుకోవడానికి అక్కడ ఒక కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ను అధికారులను వేడుకుంటున్నారు.

# మొంథా తుఫాన్ ప్రభావంతో దుర్గి మండలం పశువైద్య శాఖ అప్రమత్తం



దుర్గి మేజర్ న్యూస్ : పల్నాడు జిల్లా దుర్గి మండలం లోని పలు గ్రామాలలో మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించిన నేపథ్యంలో పల్నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి. రామారావు దుర్గి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మండలాల్లోని పశువైద్యులు, సహాయ సంచాలకులకు పలు సూచనలు, దిశానిర్దేశాలు చేశారు.పాడి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాగా లేని పశు వులను గుర్తించి వెంటనే చికిత్స అందించాలని ఆదేశించారు. వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే, గేదెలలో గొంతు వాపు టీకాలు మరియు జీవాలలో చిటిక వ్యాధి నివారణ టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటివరకు పల్నాడు జిల్లాలో 4,10,000 గేదెలకు గాలి కుంటి వ్యాధి టీకాలు వేసినట్లు తెలిపారు. పశుసంవర్ధక సిబ్బంది పాడి రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాడి రైతులు తమ పశువులు లేదా జీవాలు అనారోగ్యానికి గురైన వెంటనే సంబంధిత పశువైద్య అధికారులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దుర్గి పశువైద్యశాలలో రైతులతో సమావేశమైన డాక్టర్ రామారావు, పశు సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ, టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.



# మాదక ద్రవ్యాల నియంత్రణకు ఉక్కు పాదం మోపుదాం,

## అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్ లు ఏర్పాటు చేయండి - కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఉక్కు పాదం మోపుదామని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఆవిష్కృతం చేయాలన్నారు. జిల్లాలో గట్టి నిఘా ఉండాలని అన్నారు. రవాణా వ్యవస్థపైన, విద్యా సంస్థలుపైన నిఘా ఉండాలని చెప్పారు. అన్ని పాఠశాలలు, కళాశాలలలో ఈగల్ క్లబ్ లు ఏర్పాటు చేయాలని, ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు, మాదక ద్రవ్యాల దిశగా అడుగులు వేయకుండా అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. మత్తు, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం, తయారీ, సరఫరా వంటి సమాచారం ఎక్కడ ఉన్నా తక్షణం పోలీసు అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. మందుల దుకాణాలలో కొన్ని మందులను వైద్యుల సలహాల మేరకు మాత్రమే వినియోగించాలని, నిబంధనలు ఉల్లంఘించే మందుల దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో ముఖ్యంగా యువతలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించి, మత్తు మాదక ద్రవ్యాలు వలన ఆరోగ్యంపైనా, ఆర్థికంగాను పడే ప్రభావాలు తెలియజేయాలని అన్నారు. మాదక ద్రవ్యాలు వలన కుటుంబం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా బంధువులను, స్నేహితులను కోల్పోవడం జరుగుతుందని వివరించారు. పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో 2025 సంవత్సరంలో ఇప్పటి వరకు 65 కేసులు నమోదు చేశామని, 26 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఏడుగురుపై పి.డి కేసులు నమోదు చేశామని వివరించారు. ఒడిశా రాష్ట్రంతో పాటు, ఆ రాష్ట్ర సరిహద్దుల జిల్లాల నుండి రవాణా ద్వారా జిల్లాకు చేరడంతో పాటు ఇతర నగరాలకు రవాణా అవుతున్నట్లు గుర్తించామని వివరించారు. మత్తు మాదక ద్రవ్యాల తయారీ, సరఫరా, వినియోగం, రవాణాలో ఎక్కువ సార్లు భాగస్వామ్యం అవుతున్న వ్యక్తులపై హిస్టరీ షీట్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. 130 మంది ఎక్కువ సార్లు ఈ కార్యకలాపాలలో భాగస్వామ్యం అయినట్లు గుర్తించామన్నారు. నగర పాలక సంస్థ శివారు ప్రాంతాల్లోను, నిరుపయోగంగా ఉన్న భవనాల్లోనూ గంజాయి, మత్తు పదార్థాల వినియోగదారులు చేరుతున్నట్లు సమాచారం అందుతుందని, అటువంటి ప్రదేశాల పట్ల నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలని కోరారు. 839 ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒత్తిడి నివారణ మాత్రలను వైద్యుల చీటి లేకుండా మందుల దుకాణాలు విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం ఉందని, దానిపై దృష్టి సారించాలని అన్నారు. వసతి గృహాల్లోనూ నిఘా ఉండాలని, సామాన్య వస్తువులుగా ప్యాకింగ్ చేసి ఆర్.టి.సి, రైలు, ఇతర మాధ్యమాల ద్వారా రవాణా చేస్తున్నారని వాటి పట్ల డ్రైవర్లకు, కండక్టర్ లకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రామకృష్ణ, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన, జిల్లా విద్యా శాఖ అధికారి సి.వి. రేణుక, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జె.పద్మ, డ్రగ్స్ నియంత్రణ అధికారి లక్ష్మణ రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గా భాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి అనేక వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వినూత్న రీతిలో దూసుకుపోతున్నారు. ప్రతిరోజూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఆయన చురుకుగా పాల్గొంటూ, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. శుక్రవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజా దర్బార్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికల మాదిరిగా ఆయన నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఎమ్మెల్యేకు సమస్య తెలిస్తే వెంటనే అమలు జరుగుతుందన్న విశ్వాసంతో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ ప్రజా దర్బార్‌లో నియోజకవర్గ ప్రజల నుంచి అనేక వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే, వాటిని తక్షణం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా, కోటప్పకొండ వద్ద నివాస గృహాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్న దాదాపు 150 కుటుంబాల యానాదులు తమకు న్యాయం కావాలని ఎమ్మెల్యేను కోరారు. సుమారు 30 సంవత్సరాల నుంచి ప్రభుత్వ స్థలంలో చిన్న గుడిసెలలో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాలు, తుఫాను కారణంగా గుడిసెలు, వీధులు గాలులకు చెల్లాచెదురై నిరాశ్రయులయ్యాయని ఎమ్మెల్యే ముందు విలపించారు.

వారి కష్టాలు చూసి కరిగిపోయిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, అక్కడికి వచ్చిన మహిళలు, పురుషులను అందరినీ వెంటబెట్టుకుని నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. నిరాశ్రయులైన యానాదులకు తగు న్యాయం చేయాలని, బాధితుల పక్షాన నిలబడి తక్షణ సహాయానికి హామీ ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్, ప్రభుత్వంతో సంప్రదించి ఈ కుటుంబాలకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కోటప్పకొండ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి లింగాల వీరప్పయ్య బాధితులను ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకొచ్చి సమస్య పరిష్కారానికి సహకరించారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ఇతర సమస్యలను కూడా ఎమ్మెల్యే స్వీకరించి, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో, నేరుగా అధికారులను ఒత్తిడి చేసి పరిష్కారం చేయించడంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి తన నాయకత్వాన్ని నిరూపించుకున్నారు. ఈ చర్యలతో నియోజకవర్గంలో ఆయనకు ప్రజల మద్దతు మరింత పెరుగుతోంది.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి- కమీషనర్ అప్పలనాయుడు



**తెనాలి, మేజర్ న్యూస్ :** తుఫాను ప్రభావం వలన ఇటీవల కురిసిన వర్షాల వలన ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సూచించారు. పట్టణంలోని ఏడు, ఎనిమిది పారిశుధ్య డివిజన్లను ఆయన శుక్రవారం సందర్శించారు. కార్మికుల హాజరు పట్టిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అప్పలనాయుడు మాట్లాడుతూ తుఫాను ప్రభావం వలన ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వలన పట్టణ శివారు ప్రాంతాలు కాలనీలలో కొంత సమస్యలు తలెత్యాయని వాటిని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆంటీ లారా స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వేయాలని అన్నారు. కాలనీలు తదితర ప్రాంతాలలో అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సానిటీ ఇన్స్పెక్టర్లు గుమ్మడి ప్రసాద్, తిరుమలశెట్టి ప్రసాద్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రచ్చబండ కార్యక్రమం మెడికల్ కాలేజీ ల

## ప్రైవేటీకరణకు వ్యతిరేకముగా కోటి సంతకాల సేకరణ



**వినుకొండ మేజర్ న్యూస్ :** వైయకల్లు గ్రామం, శావల్యాపురం మండలం, వినుకొండ నియోజకవర్గం, పల్నాడు జిల్లా. "పల్నాడు జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ PAC మెంబర్ వినుకొండ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లా బ్రహ్మనాయుడు గారు గారి పిలుపు మేరకు రచ్చబండ" కార్యక్రమం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణ తేది : 31-10-2025 కార్యక్రమంలో వై.యస్.ఆర్ మండల కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ అనుబంధ అధ్యక్షులు మండల అనుబంధ అధ్యక్షులు, ఎంపీటీసీ లు, కో కన్వీనర్, వైయస్ఆర్ సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఎం ఏ ఎం కళాశాలలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేటలోని ఎం ఏ ఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అక్టోబర్ 31న భారతదేశ ఐక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక. ఆయన చూపిన ఐక్యత, త్యాగం, సేవా భావం ప్రతి యువకుడికి ఆదర్శం కావాలి అన్నారు కళాశాల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు తన సందేశంలో విద్యార్థులు దేశాభివృద్ధిలో ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా.ఎస్.రాజిని, డా.కె.నాగలక్ష్మి శాలెం రాజు సమన్వయం చేశారు. వారు విద్యార్థులకు ఐక్యత, సమగ్రత, జాతీయ చైతన్యం ప్రాముఖ్యతను వివరించారు ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ అనంతరం రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో కళాశాల ప్రాంగణం మార్మోగింది. చివరగా ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్లు పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

# ఘనంగా ఏ.ఐ.టి.యు.సి 106వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలు

– ఏఐటీయూసీ వినుకొండ నియోజకవర్గం సమితి



**వినుకొండ మేజర్ న్యూస్ :** నేడు ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వినుకొండ ఏఐటీయూసీమునిసిపాలిటీ ఆఫీస్ ఎదురు ఏ ఐ టి యు సి అరుణ పతాకాన్ని ఏఐ టయూసీ సీనియర్ నాయకులు రాయబారం వందనం ఏఐటీయూసీ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... "ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ముంబై నగరంలో ఆవిర్భవించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాడిన ఏకైక కార్మిక సంఘం. ఏఐటీయూసీ బ్రిటిష్ వాళ్ళని దేశం నుండి తరిమికొట్టడంలో కీలకపాత్ర ఏఐటీయూసీపోషించిందని, దేశం కోసం అనేకమంది ప్రాణ త్యాగాలు, రక్తతర్పణం చేసిందని, 8 గంటల పని దినాలు కార్మికుల చట్టాలు సాధించడంలో అలుపెరుగని పోరాటం చేసిందని కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలు నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికులకు నేటి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసిందని సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విలంబిస్తున్నాయని వాటిని తిప్పి కొట్టాలని ఏఐటియుసిఏరియా కార్యదర్శి బూదాల ఏఐటియుసిశ్రీనివాసరావు కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది". ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండ్రముట్ల సుభాని, రాచపూడి ఏసుపాదం, సంపెంగుల అబ్రహం రాజు, పచ్చిగొర్ల ఏసు, కంచర్ల కోటేశ్వరరావు, బాబురావు, కొప్పరపు మల్లిఖార్జున, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన జీడీసీసీ బ్యాంకు చైర్మన్



**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ పట్టణం KS కళ్యాణ మండపం నందు చెన్నుపల్లి వారి వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మరియు టీడీపీ సీనియర్ నాయకులు.

## గృహప్రవేశానికి హాజరైన డాక్టర్ కోడెల శివరామ్



నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ : నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డి పాలెం గ్రామ వాస్తవ్యులు తెలుగుదేశం పార్టీ నాయకులు అల్లటిపల్లి శ్రీనివాసరెడ్డి రమాదేవిల నూతన గృహప్రవేశానికి హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్.

## ఉదయ నగర్ కాలనీలో వైద్య సేవలు అందించిన వైద్య అధికారులు



**నకరికల్లు మేజర్ న్యూస్ :** నకరికల్లు మండలం నకరికల్లు శివారులో ఉదయ నగర్ కాలనీలో మూడు రోజుల నుండి వర్షం వలన అటు వైపు ఏ అధికారులు వెళ్ళకపోవడం వలన నిన్న వార్తకు స్పందించి వైద్య అధికారు శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి వారందరికీ వైద్య సేవలు అందించారు అలాగే ఆ గ్రామంలో కరెంటు ప్రాబ్లం లేకుండా సంబంధిత అధికారులు చూశారు పంచాయతీ వారు బ్లీచింగ్ గ్రామంలోని చల్లారు.

## గంజాయి కేసుల్లో ఉపేక్షించేది లేదు - సీఐ సాంబశివరావు



**తెనాలి, మేజర్ న్యూస్ :** ఇప్పటికే గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారు మరో సారి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు హెచ్చరించారు. తెనాలి త్రీ టౌన్ సర్కిల్ పరిధిలోని గంజాయి కేసుల్లో నిందితులకు శుక్రవారం రాత్రి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా, వినియోగించినా తర్యలు తప్పవన్నారు. అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతూ పట్టుబడితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగిండంతో పాటు నగర బహిష్కరణకూ వెనుకాడమని హెచ్చరించారు. పాత నేరస్తుల కదలికలపై ఎప్పికప్పుడు నిఘా ఉంటుందని అసాంఘిక కార్యకలాపాలకు ఇప్పటికైనా నిలిపివేయాలని ఆయన హెచ్చరించారు.

## బీటెక్ విద్యార్థి అదృశ్యం

**తెనాలి, మేజర్ న్యూస్ :** బీటెక్ విద్యార్థి అదృశ్యమవడంపై కేసు శుక్రవారం రాత్రి నమోదైంది. ఫిరంగిపురంకు చెందిన తాళ్లూరి వీరాస్వామి(19) ఐతానగర్‌లోని పెద్దమ్మ వద్ద ఉంటూ బీటెక్ చదువున్నాడు. కంప్యూటర్ కోచింగ్‌కు వెళుతున్న క్రమంలో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో కుటుంబసభ్యులు మందలించారు. గురువారం సాయంత్రం తెనాలి బస్టాండ్‌కు వెళ్లి తల్లికి ఫోన్ చేసి మాట్లాడి తిరిగి పెద్దమ్మ ఇంటికి రాలేదు. తల్లి బాజి తెనాలి వచ్చి పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వినుకొండ పట్టణ గ్రామదేవత శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మాణం




**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ పట్టణ గ్రామదేవత శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మాణం చేయడం కొరకు భక్తులు నిర్ణయించుకోవడమైనది. బద్వేల్ కు చెందిన దైవజ్ఞులు అనేక దేవాలయాలు దేవతామూర్తులు ప్రతిష్టించిన బద్వేల్ కు చెందిన శ్రీనాగరాజ శర్మగారు గారు మరియు పుట్టన పట్టణ పురోహితులు శ్రీ శ్రీనివాస్ శర్మ గారి ఆధ్వర్యంలో దేవాలయ పునర్మాణ కమిటీ సభ్యులు యావన్మంది కలిసి కార్యక్రమం నిర్వహించుకొనుటకు సమాయత్తమైనారు. శ్రీ పోలేరమ్మ తల్లి వినుకొండ పట్టణానికి సంబంధించిన గ్రామ దేవత అయినందువలన పట్టణం లోని భక్తులందరూ కార్యక్రమం పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అవ్వవలసినదిగా ఆహ్వానించుచున్నారు. నవంబరు ఆరో తారీఖు నుండి 8వ తారీకు వరకు తాత్కాలికంగా నిర్మిస్తున్న బాలాలయంలోకి దేవతామూర్తులను ప్రతిష్టించడం జరుగుతుంది. కావున యావన్మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అవ్వవలసినదిగా ప్రార్థన.